సాక్షి జనగామ

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) బి.పి.ఎస్.రాథోర్ అన్నారు.

- 8లో▸



ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం $35^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండగా ఉంటుంది. రాత్రివేళ నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలకు మెరుగైన వైద్యం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్

జఫర్‌గఢ్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ పేర్కొన్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల వర్చువల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పుగల్లు హెల్త్ సబ్‌సెంటర్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ సంబంధిత సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్య సేవలు అందించే విషయంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, శ్రీదేవి, కూనూర్ మెడికల్ ఆఫీసర్ రాజమౌళితో పాటు ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

జనగామ రూరల్: ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అలాగే బిల్లుల మంజూరుకు సంబంధించి ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు క్రిమినల్ కేసులు ఉంటాయని జిల్లా హౌజింగ్ పీడీ మాతృనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు కోరినట్లయితే, వెంటనే కలెక్టర్ కార్యాలయానికి లేదా గృహ నిర్మాణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

స్టేషన్‌ఘన్‌పూర్: పట్టణకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బిల్లుల విషయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలతో పాటు పంచాయతీ కార్యదర్శులను వేధిస్తున్నారని గత నెలలో వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి చట్టం పరిరక్షణకు పోరాడాలి

- బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



జనగామ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు సమైక్యంగా పోరాడాలని భారతీయ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలో పిట్టల కుమారస్వామి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మూడో మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక పెన్షన్లు నాలుగు వేలకు, వికలాంగులకు, వ్యవసాయ కార్మికులకు 6 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 8న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాలు జయప్రదం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెజగం ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పిట్టల కుమార్ 15 మందితో జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మోతే లింగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు పాతూరి సుగుణమ్మ, రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆది సాయన్న, సొప్పరి సోమయ్య, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, దళిత సంఘం జిల్లా కార్యదర్శి పైసా రాములు, కుమార్ పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 7న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కార్యదర్శి బేరే వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 13, 14 తేదీల్లో జనగామ జిల్లా కూనూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని దిండిగల్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిలో క్రీడాకారులు 7న ఉదయం 9 గంటలకు జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్ గ్రౌండ్ వద్దకు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 98492 01467లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కొత్తగా వచ్చి..బడిరూపు మార్చి..



ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్లు సేకరిస్తున్న ఉపాధ్యాయురాలు రేష్మ



రేష్మ

జనగామ: ఎన్నో సంవత్సరాలుగా మూత బడి..నూతన విద్యా సంవత్సరంలో తెరుచుకున్న బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు చక్కని బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ యువ ఉపాధ్యాయురాలు. జనగామ మండలం ఎర్రకుంట తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రేష్మా 2024 డీఎస్సీ ద్వారా ఎంపికయ్యారు. పాఠశాలకు వచ్చిన రేష్మా గ్రామంలో వాడవాడలా తిరిగి 40 మంది విద్యార్థులను చేర్పించారు. ఈ స్కూల్ రీ ఓపెన్‌లో భాగంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా వెళ్లి ఘనంగా ప్రారంభించారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో రేష్మా బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

గురువుకు వందనం

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



పల్లెల్లో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం పోస్తూ ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కొందరు కథలు, రచనలతో పాఠాలపై అవగాహన కల్పిస్తుండగా, మరికొందరు సాంకేతిక బోధనోపకరణాల ద్వారా బోధన సాగిస్తున్నారు. పలువురు ఉపాధ్యాయులు వినూత్న బోధనారీతుల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

- జనగామ

- మరిన్ని కథనాలు 8లో▸

తండా పిల్లలను బడిబాట పట్టించి..



మాధాపురం ప్రాథమిక పాఠశాల ఏఐఎక్సల్ ల్యాబ్‌లో విద్యార్థులు



నల్ల లలిత

దేవరుప్పుల: జిల్లాలోని దేవరుప్పుల మండలం మాధాపురం ప్రాథమిక పాఠశాలకు గతేడాది ప్రధానోపాధ్యాయురాలిగా నల్ల లలిత విధుల్లో చేరారు. అనతి కాలంలోనే ముప్పైలోపు ఉన్న విద్యార్థుల సంఖ్యను 90మందికి చేరేలా కృషి చేశారు. విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించేలా హెచ్‌ఎం లలిత తన భర్త రమేశ్ సహకారంతో ఆంగ్ల మాధ్యమం చదువులో సామర్థ్యం తక్కువ ఉన్న వారి కోసం ఏఐఎక్సల్ ల్యాబ్ ఏర్పర్చారు. కార్పొరేట్ పాఠశాల మాదిరిగా విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు, దినచర్య కోసం డైరీలు, క్రీడా దుస్తులు, తాగునీటి కోసం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు చేతిరాత (కాలీగ్రాఫిక్) శిక్షణ సైతం ఇప్పించారు. బడిబాటలో జిల్లాలోనే అగ్రభాగాన ఈ పాఠశాల చేరడంతో పరిసర గిరిజన తండాల నుంచి ప్రత్యేక వాహనం ఏర్పర్చుకొని విద్యార్థులు వస్తుండడం గమనార్హం.

నిమజ్జనానికి వేళాయె!

పట్టణ ప్రతిమలన్నీ నెల్లుట్ల చెరువులోకి..

- స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి చెరువుల వద్ద సౌకర్యాలు
- 500మంది పోలీసు బందోబస్తు, క్రేన్లు, తెప్పలు సిద్ధం
- నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు



నెల్లుట్ల చెరువు



నెల్లుట్ల చెరువులో ఏర్పాటు చేసిన తెప్ప

జనగామ: గణేశ్ నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. ఈసారి రెండు రోజులు నిమజ్జన వేడుకలు జరుపుకోనున్నారు. గత నెల 27వ తేదీన నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాగా, గురువారం వరకు తొమ్మిది రాత్రులు పూర్తయింది. 7వ తేదీన చంద్ర గ్రహణం ఉండడంతో 5, 6 తేదీల్లో నిమజ్జనం చేయాలని పండితులు ముందుగానే చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో ఈ నెల 6వ తేదీ నిమజ్జనం చేస్తుండగా.. ఇక్కడ మాత్రం సందిగ్ధత నెలకొంది. దీంతో రెండు రోజుల పాటు నిమజ్జనం కోసం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్‌షాలోమ్, డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి హెడ్‌క్వార్టర్‌తో పాటు ప్రతి మండలంలో ఒక్కో పాయింట్ చొప్పున అధికారికంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నెల్లుట్ల చెరువులో ఏర్పాట్లు పూర్తి..

జనగామ పట్టణంతో పాటు సమీప గ్రామాల పరిధిలోని వినాయక ప్రతిమలను లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువులో నిమజ్జనం చేస్తారు. నెల్లుట్ల చెరువు వద్ద నిమజ్జనం కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ రెండు భారీ క్రేన్లతో పాటు 40 మంది గత ఈతగాళ్లు, రెండు తెప్పలు, బోట్లను సిద్ధం చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేలా పక్కా ప్రణాళికలను తయారుచేసుకున్నారు. రెండు రోజులపాటు నిమజ్జనం కంప్లీట్ అయ్యే వరకు అధికార యంత్రాంగం మొత్తం అక్కడే ఉండనున్నారు. జిల్లాలో 1,940 వినాయక ప్రతిమలను నవ రాత్రులు పూజించగా, ఒక్క పట్టణంలోనే 2 వందలకు పైగా ఉన్నాయి. ఇందులో 20 వరకు భారీ గణపతులు ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పుట్లగుంట, పాలకుర్తిలో చెరువు వద్ద క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ కాషాయ వర్ణంగా మారాయి.

సాయంత్రం నుంచి నిమజ్జనం

శుక్రవారం(నేటి) సాయంత్రం 5 గంటలకు ఊరేగింపులు ప్రారంభమవుతాయి. జిల్లా కేంద్రంలో సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు నిమజ్జనాలు కొనసాగుతాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. నిమజ్జన ఘాట్ వద్ద 108 అంబులెన్స్, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుత్, పోలీసు శాఖల సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

వినాయక నిమజ్జనం పురస్కరించుకుని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ టి.వేణుమాధవ్ గురువారం సమీక్ష నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జన శోభాయాత్రను పురస్కరించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిమలను నిమజ్జనానికి తరలించే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వార్డుల్లో కిందకు జారిన లైన్లను సరిచేయాలని డీసీపీ కోరారు. ఊరేగింపు కార్యక్రమాల్లో డీజేలకు అనుమతి లేదని, వినియోగిస్తే సీజ్ చేస్తామన్నారు. నిమజ్జన సమయంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. నిమజ్జనం కోసం నెల్లుట్ల చెరువు వద్దకు తీసుకెళ్లాలి.

కులవృత్తులకు అండ..

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులకు అండగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ పట్టణకేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, గీత కార్మికులకు కాటమయ్య సురక్ష కిట్స్ పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ రిజ్వాన్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రవీందర్, ఆర్‌డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ లావణ్యశిరీశ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఆర్‌ఐలు సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాల మంజూరు పత్రాల పంపిణీ..

పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు గ్రామాలకు ఎంపీ నిధుల నుంచి మంజూరైన కమ్యూనిటీ భవనాలకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా అందించారు.

వనిత టీస్టాల్ ప్రారంభం..

మహిళల సంక్షేమానికి, మహిళల భద్రతకు, ఆర్థిక స్వావలంబనకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన వనిత టీస్టాల్‌ను ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు.

ఆరోగ్య జనగామకు కృషి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: ఆరోగ్యవంతమైన జనగామ నియోజకవర్గం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు రూ.13.10లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటినుంచి నీలిమా ఆస్పత్రిలో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు సైతం ఇస్తున్నామన్నారు. జిల్లా జన రల్ ఆస్పత్రిలో సిటీ స్కాన్ కోసం మొదటి నుంచి మంత్రి దామోదర నర్సింహతో మాట్లాడుతున్నానని, యంత్రం బిగించిన తర్వాత సేవల ఆలస్యంపై అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యేతో మాట్లాడించిన రెండు రోజుల్లోనే ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి రమణారెడ్డి, బాల్దె సిద్ధిలింగం, పోకల జమున లింగయ్య, గాడిపెల్లి హేమలతరెడ్డి, ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల సందీప్, చంద్రారెడ్డి, కృష్ణంరాజు, ఉడుగులు కిష్టయ్య, శ్రీనివాస్, మద్దికుంట రాధ, అనిత, విజయ్, గోవర్ధన్, రాజు, నర్సింగ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా బతుకమ్మకుంట

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మొక్క నాటిన అనంతరం ఏసీతో కలిసి నీరు పోస్తున్న కలెక్టర్

జనగామ రూరల్: బతుకమ్మకుంటను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని, సుందరీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం బతుకమ్మకుంట అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా బతుకమ్మ కుంటలో అందమైన రంగులతో ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను, బెంచీలను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్క్ పనులను వేగవంతంగా బ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు, ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షించాలి..

జనగామ: భవిష్యత్తుతరాలకు కాలుష్య రహిత స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత, సీఐలు ప్రభావతి, సంతోష్‌రెడ్డి, ఎస్సైలు జనార్దన్, మధు, నరేశ్, రాధిక, పద్మ, సుధ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయ హుండీ రూ.5లక్షలు



హుండీ లెక్కింపు వద్ద ఈఓ చిందం వంశీ

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీసిద్దేశ్వరాలయ హుండీ ఆదాయం రూ. 5 లక్షల 345లు వచ్చినట్లు ఆలయ ఈఓ చిందం వంశీ తెలిపారు. గురువారం హుండీ లెక్కింపు అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇది ఆరు నెలల హుండీ ఆదాయమన్నారు. హుండీ లెక్కింపునకు పర్యవేక్షణ అధికారిగా దేవాదాయ, దర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి హాజరు కాగా ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, సీబీఐ బీఎం గోపీనాయక్ , ప్రధాన పూజారి ఓంనమశివాయ, ధర్మకర్తలు నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, నేరెళ్ల రాజయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెసర్ల కొనుగోలులో సిండికేట్

- భారీగా తగ్గిన ధరలు
- పెట్టుబడి కూడా రావడం లేదంటూ రైతుల ఆవేదన



రైతు నరేందర్‌రెడ్డి



పెసర్లు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో పెసర్ల ధరలు మళ్లీ తగ్గాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిండికేట్ బేరం నడిపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెసర్లకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,360 ప్రకటించిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా పెసరు పంట ధరలు సగానికి పైగా తగ్గగా, సాక్షి వరుస కథనాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్తోంది. అయినప్పటికీ మార్కెట్‌లో ధరలు మాత్రం పెరగడం లేదు. గురువారం దేవరుప్పుల మండలం పెద్దమడూరుకు చెందిన రైతు బోరెం నరేందర్‌రెడ్డి ఐదున్నర క్వింటాళ్ల పెసర్లను అమ్ముకునేందుకు జనగామ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు 50శాతం మాత్రమే గిట్టుబాటు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన ధర రాక పెట్టుబడులు కూడా రావడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. వ్యాపారులు ఒక్కటై ధర రాకుండా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో పెసర్లు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రావడం లేదని దీంతో ధర తగ్గుముఖం పడుతోందని మండిపడ్డారు.

జీపీఓలు వస్తున్నారు..

- నేటి నుంచి గ్రామ పరిపాలన అధికారుల సేవలు
- జిల్లాకు 129 మంది కేటాయింపు
- సీఎం చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామక పత్రాలు
- జిల్లా కేంద్రం నుంచి రెండు ప్రత్యేక బస్సులు



జనగామ: జిల్లాలో ఈనెల 5(శుక్రవారం) నుంచి గ్రామ పరిపాలన అధికారుల పాలన మొదలుకానుంది. గ్రామ పాలనలో కొత్త శకం ప్రారంభం కానుంది. పల్లెల్లో పరిపాలనను ప్రజలకు మరింత చేరువచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీపీఓల వ్యవస్థను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్న వీఆర్‌ఓల వ్యవస్థను రద్దు చేయడంతో కొంతమేర ఇబ్బందికర పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, భూ సంబంధిత సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, ఎలక్షన్ పనులు తదితర వాటికి సంబంధించి వీఆర్‌ఓలు పర్యవేక్షించేవారు. గత సాధారణ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే జీపీఓల పాలన తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

176 రెవెన్యూ గ్రామాలు..120 క్లస్టర్లు

జిల్లాలో ఉన్న 176 రెవెన్యూ గ్రామాల పరిధిలో 129 రెవెన్యూ క్లస్టర్లుగా విభజించారు. వీటి పరిధిలో ఒక్కో గ్రామ పరిపాలన అధికారి(జీపీఓ) బాధ్యతలు అప్పగించనున్నారు. జిల్లాకు 129 మంది గ్రామ పరిపాలన అ ధికారులు రానుండగా, వీరిలో 108 మంది స్థానికులు కాగా, 21 మంది హనుమకొండ జిల్లా నుంచి నియమితులయ్యారు.


జీపీఓల బాధ్యతలు..

కొత్తగా నియమితులు కాబోతున్న గ్రామ పరిపాలన అధికారులు పల్లెల్లో ప్రజలతో నిత్యం మమేకమై పని చేయాల్సి ఉంటుంది. భూమి వివాదాల పరిష్కారం, కొలతలు, పహాణీల సవరణలు, ఎన్నికల విధులు, ఓటరు జాబితా పనులు, గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజా సమస్యలు, పరిపాలన సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తారు. జీపీఓలు పల్లెల్లో క్రమం తప్పకుండా అందుబాటులో ఉండాలి.

నేడు సీఎం చేతుల మీదుగా ఆర్డర్ కాపీలు

హైదరాబాద్ హైటెక్స్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జీపీఓలు ఆర్డర్ కాపీలు అందుకోనున్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ నేతృత్వంలో ఒక తహసీల్దార్, ఇద్దరు నాయబ్ తహసీల్దార్ల నాయకత్వంలో రెండు ప్రత్యేక బస్సుల్లో జీపీఓలు హైదరాబాద్‌కు తరలనున్నారు. రేపటి నుంచి జిల్లాలో గ్రామ పరిపాలన అధికారులు పల్లెల్లో అడుగు పెట్టడం ద్వారా స్థానిక పాలనలో కొత్త శకం ఆరంభం కానుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం..




సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జీపీఓలకు ఆర్డర్ కాపీలు అందించనున్న నేపథ్యంలో వారిని హైదరాబాద్ తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాకు 129 జీపీఓలు రానున్నారు. వీరిని రెండు ప్రత్యేక బస్సులో రెవెన్యూ అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో తీసుకెళ్తారు.

షేక్ రిజ్వాన్ బాషా, కలెక్టర్, జనగామ



- ప్రభుత్వ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లు
- నాణ్యతగా, వినూత్నంగా బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. నాణ్యత, వినూత్నంగా బోధిస్తేనే విద్యార్థులకు అర్థమవుతుంది. అప్పుడే వారు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. మంచి ఉపాధ్యాయులుగా దేశ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ఈ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి కొందరు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తూ వెలుగులు నింపుతున్నారు. ఈ క్రమంలో నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా బోధిస్తున్న పలువురు ఉపాధ్యాయులపై 'సాక్షి' స్ఫూర్తిదాయక కథనాలు.

సులభ గణితం.. ఆ సార్ స్పెషాలిటీ


విద్యార్థులకు గణితంలో సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్

జనగామ రూరల్: ఈ ఫొటోలో విద్యార్థులతో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు అల్లూరి రవీందర్. జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు గణితం అంటే భయం. వారిలో ఆ భయాన్ని తొలగిస్తేనే ఆ శాస్త్రం నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చుతారు. దీనిని గమనించిన టీచర్ రవీందర్.. 12 సంవత్సరాల నుంచి గణితం సులువుగా అర్థమయ్యేందుకు ఆ శాస్త్ర నమూనాలు తయారు చేసి బోధిస్తున్నారు. బట్టీపట్టే విధానం కాకుండా కృత్యాధార పద్ధతిలో గణితం బోధించడం ఆయన ప్రత్యేకత. 200కి పైగా గణిత మోడల్స్ తయారు చేసి బోధన సమయంలో ఉపయోగిస్తున్నానని రవీందర్ చెబుతున్నారు. కాగా, బెంగళూరు, చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రవీందర్ రెండు సార్లు బహుమతులు గెలుచుకున్నారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయుడు


వ్యాన్‌లో పాఠశాలకు విద్యార్థులను తీసుకొస్తున్న ఉపాధ్యాయుడు

గూడూరు: అతనో మారుమూల ఏజెన్సీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ఎక్కడ పనిచేసినా విద్యాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తారు. అతనే గూడూరు మండలం రాజనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ. యాకూబ్. పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచాలనుకున్న సహచర ఉపాధ్యాయుల నిర్ణయానికి యాకూబ్ తన అభిప్రాయం తెలిపారు. తాను సొంత డబ్బులు రూ. లక్షా 50 వేలు వెచ్చించి ఓ వ్యాన్ కొనుగోలు చేశారు. అంతేకాకుండా విద్యార్థులను రోజూ పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటి వద్ద చేర్చుతూ తానే వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దీంతో గతంలో ఆ పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, వ్యాన్ కొనుగోలు తర్వాత ఆ సంఖ్య 75కి పెరిగింది. కాగా, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుడే డ్రైవర్‌గా మారడంపై ఉన్నతాధికారులు గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రులను ఒప్పించి.. విద్యార్థుల సంఖ్య పెంచి


గంగాధర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వేముల గంగాధర్ విద్యార్థుల సంఖ్య పెంచారు. నెక్కొండ ప్రాథమిక పాఠశాల నుంచి గతేడాది బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించారు. మెరుగైన బోధన చేస్తామని, ఒక సంవత్సరం అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. ఇలా విద్యార్థుల సంఖ్య 10 నుంచి 36 వరకు పెంచారు. అదే విధంగా 10 మంది ఐదేళ్ల చిన్నారులు కూడా ప్రీప్రైమరీ స్కూల్‌కు వచ్చే విధంగా ఆయన కృషిచేశారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంలో ఐడెంటిటీ కార్డులు, టైలు, బెల్టులు అందించారు. ఇక తమ గ్రామ ఉన్నత పాఠశాలకు బేస్ గట్టిగా ఏర్పడింది. మరో ఐదేళ్ల పాటు బడి బతుకుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులతో ఫిజికల్ సైన్స్ టీచర్ రాజేందర్ అద్భుతాలు..


వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్.. విద్యార్థులతో అద్భుతాలు చేసి జూన్ 29న వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశవధానంపై చేసిన అంశం ఆకట్టుకుంది. మరో 12 మంది విద్యార్థులు రసాయనశాస్త్రంలోని 118 మూలకాల పేర్లు 8 సెకన్ల వ్యవధిలో చదివారు. ఇందుకుగాను 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' చోటులో లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అక్షయ.. భౌతికశాస్త్రంలో ఒకేసారి పది మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మధ్యలో ఇతర అంశాలతో మిళితంగా సమాధానాలు ఇవ్వడమేకాక, శాస్త్రవేత్తల పేర్లు, చిత్రాలను గుర్తుపెట్టుకొని అద్భుతంగా వివరించిన విధానం ఆకట్టుకుంది.

బడిని బాగు చేసి.. విద్యార్థులను తీర్చిదిద్ది


రాజేశ్


2018లో ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు టి.రాజేశ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు హైదరాబాద్‌లోని శిల్పారామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. రాజేశ్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో స్కూల్‌లో జీరో స్ట్రెంత్ ఉంది. దీంతో పాఠశాలను బాగుచేసి పిల్లలను బడిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2018లో జీరో స్ట్రెంత్ స్కూల్‌ను రీఓపెన్ చేసి రూ.40 వేలు సొంత డబ్బులు వెచ్చించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. సహచార ఉపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ సాయంతో ఇంటింటికీ తిరిగి 15మంది పిల్లలను బడిలోకి తీసుకొచ్చాడు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. దీంతో 2023లో జిల్లా స్థాయిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయగా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. జూలైలో ఢిల్లీలో జరిగిన సీసీఆర్‌టీ ట్రైనింగ్ ప్రోగ్రాంకు తెలంగాణ నుంచి 10 మంది వెళ్లగా అందులో రాజేశ్ ఉన్నారు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న బడి..


విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ భిక్షపతి (ఫైల్)

శాయంపేట: మండలంలోని కొప్పులలో నాలుగేళ్ల క్రితం మూతబడిన గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను జూన్ 30న ఎంఈఓ భిక్షపతి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వ విద్యను బతికించే ప్రయత్నం చేయడం అభినందనీయమని, విద్యే ప్రగతికి సోపానమని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలనే ఉద్దేశంతో ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిపించారు. నాలుగేళ్లుగా మూతబడిన బడిని ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని తెరిపించినందుకు మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సీఈఎల్ఈ రాథోర్
- కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ తనిఖీ


సీఈఎల్ఈ రాథోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే మజ్దూర్ యనియన్ నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) బి.పి.ఎస్.రాథోర్ అన్నారు. గురువారం సీఈఎల్ఈ షెడ్‌లో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం లోకోల నిర్వహణ పనితీరుపై విజయవాడ, లాలాగూడ, మౌలాలి, కాజీపేట డీజిల్‌షెడ్, ఎలక్ట్రిక్‌షెడ్ నుంచి పాల్గొన్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాగా, షెడ్ అభివృద్ధి, రైల్వే కార్మికుల సమస్యలను స్థానిక షెడ్ సీనియర్ డీఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

సీఈఎల్ఈకి నాయకుల వినతి

సీఈఎల్ఈ రాథోర్‌కు రైల్వే మజ్దూర్ యనియన్ కాజీపేట ఈఎల్ఎస్ బ్రాంచ్ నాయకులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. షెడ్‌లో లోకోల నిర్వహణకు సరిపడా స్టాఫ్ పెంచాలని, ఈఎల్ఎస్‌కు వచ్చే మార్గంలో రైల్వే ట్రాక్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని, వెహికిల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలనే తదితర సమస్యలను వివరించారు. దీనిపై సీఈఎల్ఈ స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం, చైర్మన్ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్ఎస్ బ్రాంచ్ ట్రెజరర్ బి.రవీందర్‌రెడ్డి, ఆఫీస్ బేరర్స్ వైస్ చైర్మన్ ఎస్.గోపి, ప్రభాకర్, ఎస్.స్వర్ణకుమారి, అసిస్టెంట్ సెక్రటరీ పి.రాజు, అరుణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

12న ఆర్టీసీల పరిరక్షణ దినం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యూశాయంపేట: దేశంలోని 59 ఆర్టీసీ (రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్)లను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ఆర్టీసీల పరిరక్షణ దినాన్ని(సేవ్ ఆర్టీసీ) విజయవంతం చేయాలని వరంగల్ రీజియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.ఎల్లయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీలకు సంబంధించి కొన్ని విలువైన భూములు ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు 59 ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదని, ఫలితంగా ఆర్టీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీంతో కార్మికులు పని భారం పెరిగి అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. అందుకోసం ఈనెల 12న ఆర్టీసీల మనుగడ కోసం 'ఆర్టీసీల పరిరక్షణ దినం' (సేవ్ ఆర్టీసీ)డిమాండ్ డే పాటించాలని, ఆ రోజున కార్మికులందరూ నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రాచారి, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, పి.మహేందర్, కొమ్మాలు, ఎండి.పాషా, సాధిక్, రవి, సంపత్, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

- వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ఉత్సాహంగా ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు


మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


పాల్గొన్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పరిపాలనభవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 వసంతాల్లో ఫార్మసీ కాలేజీ స్ఫూర్తిదాయకమైన అధ్యాపకులు, విద్యార్థులను అందించిందని కొనియాడారు. ఫార్మసీలో ఇంకా మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు జరగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ విశ్రాంత ఆచార్యులు పరమేశ్వర్ మాట్లాడుతూ ఫార్మసీ కాలేజీ ఎంతోమంది గొప్ప విద్యార్థులను అందించిందని గుర్తుచేశారు. యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జె. రాజమౌళి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా ఈ కళాశాలను నిలబెట్టుకున్నామన్నారు. కేయూ ఫార్మసీ అలుమ్ని వైస్ ప్రెసిడెంట్ ఏవీ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం పూర్వ విద్యార్థుల సంఘం పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్ రామ్‌బహూ మాట్లాడుతూ ఫార్మసీ రంగం ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. విశ్రాంత ఆచార్యులు ఎ.వి.ఎన్ అప్పారావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు రుణపడి ఉంటామన్నారు. విశ్రాంత ఆచార్యులు మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులను చూసి గర్విస్తున్నామన్నారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (అకుట్) బి. వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల చైర్మన్, ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, కన్వీనర్ గాదెసమ్మయ్య మాట్లాడారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వన్నెతెచ్చిన ఫార్మసీ కాలేజీలో గొప్పపరిశోధనలకు అవకాశాలున్నాయన్నారు. ఆచార్యులు వై. నర్సింహారెడ్డి, ఎన్ ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం వెళ్తే బంగారం పోయింది..

- విశ్వనాథపురం సమీపంలో చైన్‌స్నాచింగ్
- మూడున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన దుండగుడు


వివరాలు సేకరిస్తున్న క్రైం విభాగం సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ మహిళ యూరియా తీసుకెళ్తుండగా చైన్‌స్నాచింగ్ జరిగింది. దుండగుడు ఆమె మెడలోనుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన మండలంలోని విశ్వనాథపురం సమీపంలో జరిగింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సముద్రాల శివారులోని నారాయణపురం గ్రామానికి చెందిన కత్తుల రాజమ్మ తన భర్త యాదగిరితో కలిసి గురువారం యూరియా కోసం స్టేషన్‌ఘన్‌పూర్ వచ్చింది. యూరియా తీసుకుని అదే రోజు సాయంత్రం దంపతులు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై సముద్రాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ బైక్‌పై వారి వెనుక వచ్చిన దుండగుడు విశ్వనాథపురం సమీపంలో రాజమ్మ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. ఈ ఘటనలో సదరు మహిళ ద్విచక్రవాహనంపై కింద పడి స్పృహ తప్పింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహలోకి వచ్చిన అనంతరం లబోదిబోమని రోదించింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. క్రైం విభాగం సీఐ రాఘవేందర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

యూరియా బస్తాలు మాయం

- పొగుళ్లపల్లి పీఏసీఎస్‌లో ఘటన


సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు సరఫరా అయిన యూరియాలో 94 బస్తాలు మాయమయ్యాయి. ఏఓ ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు బుధవారం సాయంత్రం యూరియా పంపిణీ చేశారు. పంపిణీ నిలిపివేయాలనుకునే సమయానికి గోదాం వైపునకు రైతులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో తనిఖీ చేయకుండా గోదాం మూసివేశారు. మరుసటి రోజు వచ్చి లెక్క చూడగా సరికి 94 బస్తాల తేడా వచ్చింది. దీంతో సీసీ ఫుటేజీని పరిశీలించిన అధికారులు.. హమాలీలను విచారించగా 34 మంది తమ అవసరాలకు అనుగుణంగా తీసుకున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రికవరీ చేసి పంపిణీ చేశారు. కాగా, యూరియా మాయంపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తాలు ఒక నాయకుడికి ఇచ్చి హమాలీలను కారణంగా చూపుతున్నారనే చర్చ సాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు గాయాలు


తీవ్ర గాయాలతో రబ్బాని పాషా

ధర్మసాగర్: రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రబ్బాని పాషా రాంపూర్ శివారులోని సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయంలో డెస్క్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో రాంపూర్ శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడి ని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రబ్బాని పాషా ఆరోగ్యం విషమంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

చాక్లెట్ కొనుక్కొని వస్తూ మృత్యుఒడికి..

- లారీ ఢీకొని బాలుడి దుర్మరణం
- గోవిందరావుపేటలో ఘటన


హర్షసాయి(ఫైల్)


గోవిందరావుపేట: చాక్లెట్ కొనుక్కొని వస్తూ ఓ బాలుడు మృత్యుఒడికి చేరాడు. లారీ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోవిందరావుపేటకు చెందిన చెన్ను నర్సింహరావు తన ఇంటి నిర్మాణం కోసం ఇటుక ఆర్డర్ చేయడానికి వెళ్లే క్రమంలో తోడుగా మనువడు కొప్పనాతి హర్షసాయి (4)ని వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో హర్షసాయి కిరాణా షాపులో చాక్లెట్లు తీసుకుని రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో ఏటూరు నాగారం నుంచి వరంగల్ వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నెల క్రితం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇదే ప్రదేశంలో అల్లే వెంకటేష్ (17) మృతి చెందాడు. ఈ ప్రాంతంలో తరచూ రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గూడ్స్ షెడ్‌కు ఎరువుల రాక

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు గురువారం ఎరువులు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు 2లక్షల 35వేల యూరియా బస్తాలు చేరుకున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చంబల్ కంపెనీ ఎంఓపీ(పొటాష్)1,079.400 మెట్రిక్ టన్నులు చేరుకోగా.. కోరమండల్ కంపెనీ చెందిన 28.28.0 రకం 483.300 మెట్రిక్ టన్నులు, 20,20,013 రకం 1,350.000 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరుకున్నాయి. ఈ ఎరువులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు పంపిణీచనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్ తెలిపారు.

దేవాలయ భూముల్లో భవనాలు ఖాళీ చేయాలి

- గోవిందరాజుల గుట్ట భూమి ఆక్రమణపై దేవాదాయ శాఖ నోటీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని చారిత్రక గోవిందరాజుల గుట్ట దేవాలయ భూముల ఆక్రమణలపై మల్లగుల్లాలు పడిన దేవాదాయశాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. దేవాలయానికి చెందిన భూములపై పలుమార్లు సర్వే చేసిన అధికారులు.. రెండు రోజుల క్రితం వ్యాపార సంస్థలు, ఇళ్లవాసులకు నోటీసులు జారీ చేశారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 15/1, 15/2, 38లో సుమారు 8 ఎకరాలు ఉందని నిర్ధారించారు. అయితే సర్వేలో 5 ఎకరాల 25 గుంటలు మాత్రమే తేలింది. మిగతా స్థలంలో అక్రమంగా వ్యాపార సంస్థలు, నివాస గృహాలను నిర్మించుకున్నట్లు భావిస్తున్నారు. సుమారు 54 నిర్మాణాలుండగా, అందులో 15 వ్యాపార సంస్థలు, 39 నివాస గృహాలు ఉన్నాయి. వీరందరూ వ్యాపార సంస్థలు, నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయగా, కొంత మంది స్వీకరించగా, మరికొందరు నిరాకరించారు.

సీపీఎం నేతలు, గృహ యజమానుల నిరసన

గోవిందరాజుల గుట్ట చుట్టూ ఉన్న నివాస గృహాలకు దేవాదాయ శాఖ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీస్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. 120 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి 54 కుటుంబాలకు అకస్మాత్తుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి ఆందోళన గురిచేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు బాబు, మాధవి, కుమార్, శివ, సంపత్, రమేశ్,యాదగిరి, రామ సరోజన, సదానందం, గోవర్ధన్ పాల్గొన్నారు.